# మే 1-అంతర్జాతీయ శ్రామికవర్గ దీక్షాదినం 'మేడే' వర్ధిల్లాలి



**అంతర్జాతీయ కార్మికవర్గ దీక్షాదినాన, ప్రపంచవ్యాపితంగా పోరాటాలు సాగిస్తున్న కార్మికులందరికీ విప్లవాభినందనలు తెలియ జేస్తున్నాము.**

ఈ సం॥రం 'మేడే'కు చారిత్రక ప్రాధాన్యత వుంది. 1818 మే 5న జన్మించిన గొప్ప విప్లవ ఆలోచనాపరుడు కార్ల్‌మార్క్స్ 200వ జయంతిని కూడా ఈ సందర్భంగా కలిపి నిర్వహించుకుంటున్నాం. కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో 'సకల దేశ శ్రామికులారా, ఏకంకండి' అని ఇచ్చిన పిలుపు అన్ని దేశాలలోనూ ఈనాటికీ ప్రతిధ్వనిస్తూ, కార్మికవర్గ పోరాటాలను ఉత్తేజపరుస్తూనే వుంది. కార్ల్‌మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథంలో రుజువు పరిచిన విధంగానే ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకోలేని సర్వవ్యాపిత సంక్షోభపు ఊబిలో కూరుకుపోయి, ప్రపంచీకరణ విధానాలను అనివార్యంగా చేపట్టవలసి వచ్చింది.

అయినా సంక్షోభం నుండి ఉపశమనం లభించకపోగా సంక్షోభాన్ని ఇది మరింత తీవ్రం చేసింది. రెండవ ప్రపంచయుద్ధ ముగింపు తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థపై నెలకొన్న అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యం నేడు బలహీన పడింది. దీనితో అమెరికా సామ్రాజ్యవాదం మరింత ప్రమాదకరంగా తయారై దురాక్రమణ యుద్ధాలకు దిగుతోంది.

శ్రామికప్రజల మూపులపై సంక్షోభ భారాన్ని మోపేందుకు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని దేశాలలో కార్మికులకు వేతనాలను దిగజారుస్తూ, పని పరిస్థితులలో అభద్రతను పెంచుతూ, కార్మికులకున్న సంక్షేమ చర్యలన్నింటినీ రద్దుచేస్తూ సామ్రాజ్యవాద దేశాలు కార్మికుల స్థితిగతులను దిగజారుస్తున్నాయి. అత్యున్నత సాంకేతికతతో సబ్సిడీలద్వారా సామ్రాజ్యవాద దేశాలలో తయారుచేసిన ఆహార ఉత్పత్తులను దిగుమతిచేసుకోవటం, భూస్వాధీనం వంటి వానిద్వారా ఈ దేశాలలో రైతాంగ జీవనాధారాలన్నీ పెనుప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో, సామ్రాజ్యవాద దేశాలలో కార్మికవర్గం తమ హక్కులపై జరుగుతున్న దాడులతో–సాపేక్షంగా తక్కువ వేతనాలు, ఔట్‌సోర్సింగ్ (పొరుగు సేవలు), పనిగంటల మార్పు వంటి చర్యలతో–ఒక అనిశ్చిత స్థితికి నెట్టబడటం పెరుగుతోంది.

అయినప్పటికీ ప్రజలు ఈ దాడులను ప్రతిఘటిస్తున్నారు. అమెరికాలో వేలసంఖ్యలో ఉపాధ్యాయులు తమ వేతనాలలో కోతలకు, వ్యక్తిగత ఆరోగ్యరక్షణ ఖర్చు పెంపుకు వ్యతిరేకంగా, ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసిస్తూ దేశవ్యాపితంగా ఆందోళనలు చేస్తున్నారు. ఫ్రాన్స్‌లో కార్మికులు ప్రభుత్వ పొదుపు చర్యలను మరియు కార్మికుల హక్కులను కుదించివేసే అధ్యక్షుడు మాక్రాన్ ఆదేశాలకు వ్యతిరేకంగా కదులుతున్నారు. జర్మనీలో కార్మికులు అనేక సమ్మెలు చేయగా, ఇంగ్లాండ్‌లో అధ్యాపకులు ప్రభుత్వ పొదుపుచర్యలను నిరసించారు. జనవరిలో గ్రీసు కార్మికులు ప్రజారవాణా వ్యవస్థను, నావికా వ్యవస్థను పూర్తిగా స్థభింపజేసి ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసించారు. ఇదే అంశంపై ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్‌లలో కార్మికుల సమ్మెలు జరిగాయి.

ఇరాన్‌లో పొదుపు చర్యలకు వ్యతిరేకంగా నిరసనలు, ప్రదర్శనలు, సమ్మెలు; నైజీరియా, కెన్యా, జింబాబ్వేలలో ఉపాధ్యాయుల సమ్మెలు; ట్యునీసియా, మెక్సికోలలో దిగజారుతున్న పనిపరిస్థితులను వ్యతిరేకిస్తూ భారీ ప్రజాప్రదర్శనలు; చైనాలో సాంకేతిక కార్మికులు సాగించిన మూడువారాల సమ్మె, ఈవిధంగా ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గం, ప్రజానీకం వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలలోకి వస్తున్నారు.

సామ్రాజ్యవాద యజమానుల ఆదేశానుసారం మనదేశంలో పాలకులు అమలుచేస్తున్న నూతన ఆర్థిక సంస్కరణలు, రైతాంగ ఆర్థికవ్యవస్థను ధ్వంసంచేసి, పెద్దసంఖ్యలో వారిని బలవన్మరణాల వైపు నెడుతోన్నాయి. మరోవైపు పొట్టచేత పట్టుకొని, పల్లెలను వదలి పనులకోసం పట్టణాలకు నెట్టబడుతున్న వారంతా, పట్టణాలలో ఉపాధి లభించక, దుర్భర జీవన పరిస్థితులలో మురికివాడలలో మగ్గుతున్నారు. కార్మికులు వరుసదాడులకు గురవుతున్నారు. 'నిర్దిష్ట కాలపరిమితి ఉద్యోగ ఒప్పందం'(ఎఫ్‌టిసి) వీటిలో తాజా అయింది. దీనితో కార్మికులు గుత్తపెట్టుబడియొక్క నికృష్ట దోపిడీకి గురై, తమకున్న కనీసపాటి హక్కులన్నీ కోల్పోవలసివస్తోంది. మత, కుల, ప్రాంతీయ అంతరాలను ఉపయోగించటంద్వారా ప్రజలను చీల్చి శ్రామిక ప్రజల సంఘటితశక్తిని బలహీనపరిచేందుకు భారత పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. యూరప్, అమెరికా, జపాన్‌లలో నయాఫాశిస్టు ధోరణుల పెరుగుదల ప్రభావం భారతదేశంపై వుంది. ప్రజలను అణచివేయటానికి ఫాశిస్టు తరహా పద్ధతులను ప్రయోగించటం పెరిగింది.

అయినప్పటికీ, పాలకవర్గాలు ప్రయోగిస్తున్న దుర్మార్గాలను ప్రజానీకం ప్రతిఘటిస్తూ నిరసిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధ భూసేకరణను దేశవ్యాపితంగా రైతాంగం నిరసిస్తున్నారు. వ్యవసాయ సంక్షోభ పరిష్కారాన్ని డిమాండ్‌చేస్తూ వారంతా ఆందోళన చేస్తున్నారు. యూనియన్ స్థాపించుకునే హక్కుతోసహా కార్మిక హక్కులన్నింటినీ కాలరాయటాన్ని వ్యతిరేకిస్తూ, దిగజారుతున్న పనిపరిస్థితులకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారు. వివిధ తరగతుల ప్రజానీకం–ఉపాధ్యాయులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, చిన్నపరిశ్రమదారులు అదేవిధంగా మహిళలు, దళితులు, ఆదివాసులు, విద్యార్థి యువజనులు–తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్నారు.

లెనిన్ పేర్కొన్నవిధంగా విప్లవ పరిస్థితి పరిపక్వంగా వుంది. పాలకవర్గాలు సాధారణ పద్ధతుల్లో పరిపాలన సాగించలేకున్నారు;

తమ పాలనను కొనసాగించటానికి మరింతగా నిరంకుశ విధానాలను వారు అనుసరిస్తున్నారు; కార్మికవర్గం ఈ దాడులను ప్రతిఘటిస్తోంది. సామ్రాజ్యవాద దేశాలలో ప్రాథమిక రూపంలో ప్రారంభమైన వర్గపోరాటాలన్నీ ప్రస్తుతం వేతనాల సమస్య, పనిపరిస్థితులు, ఆరోగ్యభద్రత, విద్య మొదలైన సమస్యలపై కేంద్రీకరిస్తున్నాయి. కాగా, భూదురాక్రమణ, జీవనాధారాలు దిగజారటం, దుర్భర పనిపరిస్థితులు, సహజ వనరుల విచ్చలవిడి దోపిడీవంటి సమస్యలపై ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో వర్గ ఉద్యమాలు కేంద్రీకరిస్తున్నాయి. ఈ సమస్యలు ఒక విభాగానికి చెందిన, పరిమిత డిమాండ్లు అయినప్పటికీ శ్రామిక జనావళి నడుమ యావత్ కార్మికవర్గానికి చెందిన సమస్యలపై ఈ ఉద్యమాలు సాగాల్సి వుంది. ప్రతి వర్గపోరాటం ఒక రాజకీయ పోరాటమని కార్ల్‌మార్క్స్ పదేపదే నొక్కి చెప్పాడు. ప్రతి వర్గపోరాటంయొక్క రాజకీయ అంశాన్ని వెలికితెచ్చి రాజకీయాధికార పోరాటదిశగా వాటికి నాయకత్వం వహించటం ప్రతి కమ్యూనిస్టు బాధ్యతగా వుంటుంది.

1885లో కార్ల్‌మార్క్స్ ఇలా వ్రాశారు: ***"ఈ దైనందిన పోరాటాలు ఎలా పరిణమిస్తాయనే విషయంపై కార్మికవర్గం మరీ అతిశయాలకు పోగూడదు. తాము పోరాడుతున్నది ఫలితాలకు వ్యతిరేకంగా మాత్రమేననీ, వాటికిగల కారణాలకు వ్యతిరేకంగా కాదనీ వారు మరచిపోకూడదు. తాము పరిస్థితుల్ని దిగజారకుండా నిరోధిస్తున్నామేగానీ, అసలు మార్గాన్ని మార్చడం లేదనీ; వ్యాధియొక్క ఉగ్రతను తగ్గించటానికి ప్రయత్నిస్తున్నామేగానీ, వ్యాధిని నిర్మూలించడం లేదనీ వారు గమనించాలి. కాబట్టి పెట్టుబడిదారులు నిరంతరం చేసే దాడులనుండి, లేదా మార్కెట్టుయొక్క ఎగుడుదిగుడులనుండి ఉత్పన్నమయ్యే అనివార్యమైన గెరిల్లా పోరాటాలలోనే వారు నిమగ్నం కాకూడదు. నేటి ఆర్థికవ్యవస్థ కార్మికులను ఎన్నో బాధలకు లోనుచేస్తున్నా, ఆర్థికంగా దాన్ని పునర్నిర్మించేందుకు అవసరమైన భౌతిక పరిస్థితుల్ని, సామాజిక రూపాలను కూడా అది ఏకకాలంలో సృష్టిస్తూందనే విషయాన్ని వారు జ్ఞాపకముంచుకోవాలి. 'న్యాయమైన పని దినానికి న్యాయమైన వేతనం' అనే మితవాద నినాదం స్థానే వారు తమ పతాకంమీద 'జీతాల పద్ధతి రద్దుకావాలి' అనే విప్లవకర నినాదాన్ని చిత్రించుకోవాలి."*** ('వేతనం, ఖరీదు, లాభం' నుండి)

వేతన బానిసత్వం అనగా పెట్టుబడిదారీ విధానం రద్దయ్యేంతదాకా ఈ వర్గపోరాటాలకు నాయకత్వం వహించేందుకు శ్రామికవర్గ అగ్రగామి దళమైన కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం అవసరమౌతుంది.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం మిత, అతివాద పెడధోరణులను; రివిజనిస్టు ద్రోహాన్ని ఎదుర్కొంటూ కష్టకాలం గుండా సాగుతోంది. ఈ సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ అవరోధాలను అధిగమించి, నిజాయితీగల విప్లవ కమ్యూనిస్టు పార్టీని నిర్మించటం నేటి ఆవశ్యకతగా వుంది. కమ్యూనిస్టు పార్టీ లేకుండా భారతదేశ నూతన ప్రజాతంత్ర విప్లవం ముందుకు పురోగమించజాలదు.

నిజాయితీగల కమ్యూనిస్టు పార్టీని నిర్మించే కర్తవ్యానికి, ప్రజలను నూతన ప్రజాతంత్ర విప్లవంలోకి సమీకరించి, విప్లవాన్ని విజయవంతంచేయటానికి మనల్ని మనం పునరంకితం చేసుకుందాం. ఇదే మేడే స్ఫూర్తి. ప్రపంచ కార్మికవర్గానికి మార్క్స్ చూపిన మార్గదర్శకత్వం ఇదే.

- ***కార్ల్‌మార్క్స్ జ్ఞాపకాలను సదా మదిలో పదిలపరుకుచుందాం***
- ***మేడే చిరకాలం వర్ధిల్లాలి***
- ***మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి***

ooooo